
సాక్షి
హనుమకొండ

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



బస్తాల బరువు టెన్షన్
ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతులు బస్తాల బరువు 50 కేజీల కంటే ఎక్కువగా తేవడంతో గంటన్నరపాటు కొనుగోళ్లు నిలిచిపోయాయి. - 8లో▸



బైక్ నుంచి రూ.2లక్షలు చోరీ
ఓ షాపు ఎదుట ద్విచక్ర వాహనాన్ని ఉంచి షాపులోకి వెళ్లి వచ్చేసరికి అందులోని రూ.2లక్షలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$36^0/25^0$

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

ఎమ్మెల్యే 'అరూరి'ని ఆశీర్వదించిన కేసీఆర్



హసన్‌పర్తి: వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వదించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని రమేష్ మంగళవారం హైదరాబాద్‌లో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కేసీఆర్ బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భద్రకాళిమాతకు ఎమ్మెల్యే పూజలు
హన్మకొండ కల్చరల్ : జన్మదినోత్సవం సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ మంగళవారం శ్రీభద్రకాళి దేవాలయాన్ని దర్శించి అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆరూరి విశాల్, కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, జన్ను షీభారాణి పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ ' సేవలను సద్వినియోగించుకోవాలి

ఎంజీఎం: 'ఆరోగ్య మహిళ 'సేవలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. మంగళవారం మెప్మా పీడీ భద్రునాయక్‌తో కలిసి ఆయన శాయంపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సందర్శించి సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక్, మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, డాక్టర్ క్రాంతి, మెప్మా ఏపీడీ వెంకట్‌రెడ్డి, ఆప్తాలమిక్ అధికారి రవీందర్‌రెడ్డి, సీఓ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీకి తలంబ్రాల అందజేత

హన్మకొండ: వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణం తలంబ్రాలను ఆర్టీసీ అధికారులు అందించారు. ఆర్టీసీ కార్గో, పార్శిల్ సర్వీస్ ద్వారా సీపీ రంగనాథ్ తలంబ్రాలు బుక్ చేసుకోగా మంగళవారం హనుమకొండలో ఆర్టీసీ లాజిస్టిక్స్ ఎటీఎం వేణుగోపాల్, ఉద్యోగులు అందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ వరంగల్ రీజియన్‌లో 7,302 మంది తలంబ్రాలు బుక్ చేసుకున్నారని వివరించారు. తలంబ్రాలు కావాల్సిన భక్తులు ఈ నెల 10వ తేదీలోపు రూ.116 చెల్లించి ఆర్టీసీ కార్గో, పార్శిల్ సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

హన్మకొండ: నిరుద్యోగులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని హనుమకొండ జిల్లా ఉపాధి, శిక్షణశాఖ అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్టు కలిగి ఉండి విదేశాల్లో పనిచేయాలని ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని వివరించారు. ఈ నెల 9వ తేదీలోపు www.kaushalmahotsav.nsdcdigital.org. International/Candidate వెబ్‌సైట్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 880005555, 18001239626లో సంప్రదించాలని కోరారు.

ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హన్మకొండ: పదవ తరగతి ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకువాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌నుంచి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి మంత్రి సబిత 10వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లానుంచి హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వీసీలో సీపీ రంగనాథ్, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, డీఈఓలు అబ్దుల్‌హై, వాసంతి తదితరులు పాల్గొన్నారు.



వైరల్ ఇలా..

- ఉదయం 9.45 గంటలకు ఓ విద్యార్థి నుంచి హిందీ పరీక్ష పత్రాన్ని తీసుకుని బాలుడు తన సెల్‌ఫోన్‌తో ఫొటో తీశాడు.
- బాలుడు వెంటనే మౌటం శివ గణేష్ అనే వ్యక్తికి వాట్సాప్ చేశాడు.
- శివగణేష్ 9.59 నిమిషాలకు ఎస్ఎస్‌సీ 2019–20 అనే వాట్సాప్ గ్రూప్‌కు ఫార్వర్డ్ చేశాడు.
- ఆ గ్రూపులో ఉన్న ప్రశాంత్.. ఆ ప్రశ్నపత్రాన్ని వివిధ గ్రూపులకు ఫార్వర్డ్ చేశాడు.
- 10.46 గంటలకు మీడియా గ్రూపుల్లోకి వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అయ్యింది.

లీకేజీ కలకలం

పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం వాట్సాప్‌లలో ప్రత్యక్షం

పరీక్ష ప్రారంభమైన పదిహేను నిమిషాల్లోనే బయటికి..

- ఆందోళన చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు
- సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన వరంగల్, హనుమకొండ డీఈఓలు
- లీకేజీ కాదు.. కాపీయింగ్ అని చెప్పుకొచ్చిన సీపీ
- మైనర్‌తోపాటు ఇద్దరు నిందితుల అరెస్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి/వరంగల్‌క్రైం/కమలాపూర్: పదో తరగతి వార్షిక పరీక్షల హిందీ ప్రశ్నపత్రం లీకేజీ అంశం.. ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. పరీక్ష ప్రారంభమై ప్రశ్నపత్రాలు విద్యార్థుల చేతికి చేరిన వెంటనే బయట వాట్సాప్ గ్రూప్‌లలో ప్రత్యక్షమైంది. ఒకరినొకరు షేర్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఒకవైపు విద్యాశాఖాధికారులు కంగుతినగా, మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మొన్నటికి మొన్న టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు, నిన్న వికారాబాద్‌లో టెన్త్ తెలుగు, తాజాగా మంగళవారం హనుమకొండ ఘటన.. ఒకింత కలకలం రేపుతున్నాయి. మొదట వరంగల్ జిల్లానుంచి అని కొంతసేపు.. హనుమకొండ జిల్లానుంచి లీకైందని మరికొంతసేపు వార్తలు వెలువడ్డాయి. దీంతో రెండు జిల్లాల డీఈఓలు డి.వాసంతి, ఎండీ అబ్దుల్‌హైలు హుటాహుటిన వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ వద్దకు వెళ్లి హిందీ పేపర్ లీకేజీ అయిందని, సోషల్ మీడియాలో వైరల్ అయిందనేది మౌఖికంగా తెలియజేశారు. మొదట హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌నుంచి బయటికి వచ్చినట్లు భావించారు. పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ జరిపారు. అక్కడ ఎటువంటి ఆధారాలూ లభించలేదు. తదనంతరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలనుంచి బయటికి వచ్చినట్లు గుర్తించారు. ఇందుకు బాధ్యులుగా మైనర్‌తోపాటు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అయితే సీపీ రంగనాథ్ ఇది పేపర్ లీకేజీ కాదని, కాపీయింగ్ కిందికి వస్తుందని చెప్పుకొచ్చారు. కమలాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సీఎస్ శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్) యాక్ట్ 1997 ప్రకారం ఐపీసీ 420 సెక్షన్‌కింద స్థానిక ఎస్ఐ మోటం సతీష్ కేసు నమోదు చేశారు.

లీక్ ప్రచారం వెనుక మరికొందరి పాత్రపై విచారణ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ రంగనాథ్

సంచలనం రేపిన పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీక్ ప్రచారం వెనుక మరికొందరి పాత్ర ఉందని భావిస్తున్న పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కమలాపూర్ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మాటూరి శివప్రసాద్ నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. సెక్షన్ 5 కింద కేసు నమోదు చేసి క్వశ్చన్ పేపర్ ఫొటో తీసిన బాలుడి నుంచి విచారణ ప్రారంభించి నలుగురిని నిందితులుగా తేల్చారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించి మౌటం శివ గణేష్, దూడం ప్రశాంత్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గుండెబోయిన మహేశ్ కోసం గాలిస్తున్న పోలీసులు మరికొందరిపై ఆరా తీస్తున్నారు.

ఎస్ఎస్‌సీ 2019–20 గ్రూపుపై ఆరా.. .
కమలాపూర్ ప్రాంతానికి చెందిన కొందరు 31 మందితో ఎస్ఎస్‌సీ 2019–20 గ్రూపు నిర్వహిస్తున్నారు. బాలుడు తీసిన ఫొటో శివగణేష్ ద్వారా ఇదే గ్రూపులో పోస్టు చేశారు. గుండెబోయిన మహేష్ అనే మరో మాజీ జర్నలిస్టు ద్వారా దూడం ప్రశాంత్ (మాజీ జర్నలిస్టు)కు చేరినట్లు గ్రహించిన పోలీసులు ఆ తర్వాత ఎవరెవరికీ ప్రశ్నపత్రం చేరిందన్న కోణంలో విచారణ చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు సోషల్ మీడియా గ్రూపులలో షేర్ చేసిన వారిని గుర్తించి వారికి సైతం నోటీసులు ఇచ్చి విచారించనున్నామని సీపీ రంగనాథ్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించిన నేపథ్యంలో ఎస్ఎస్‌సీ 2019–20 గ్రూపులోని సభ్యుల కాల్‌డేటా, పోస్టింగ్‌లపైనా ఆరా తీస్తున్నారు. మరో నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నందున డీఈఓలు వాసంతి, అబ్దుల్ హైలు మరింత పోలీసు భద్రత కోసం సీపీ రంగనాథ్‌ను కలిశారు. ఈ మేరకు పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలకు అదనంగా పోలీసు బందోబస్తు పెంచనున్నట్లు సీపీ ప్రకటించారు

ఉప్పల్ జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విచారణ

సీఎస్, డీఓ, ఇన్విజిలేటర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం



ఉప్పల్ పరీక్ష కేంద్రంలో విచారణ జరుపుతున్న ఏసీపీ శ్రీనివాస్

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో టెన్త్ హిందీ ప్రశ్నపత్రం లీకైందన్న ఉదంతం కలకలం సృష్టించింది. కమలాపూర్ తహసీల్దార్ పోలెపాక రాణి, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, హసన్‌పర్తి సీఐ నరేందర్, ఎస్సై సతీష్, సిబ్బందితో కలిసి ఉప్పల్ జెడ్పీ బాలికల హైస్కూల్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడి సీఎస్ బి.మల్లయ్య, డీఓ నటరాజ్, ఇన్విజిలేటర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని విచారించారు. పరీక్ష ముగిసిన అనంతరం విద్యార్థుల వద్ద ప్రశ్నపత్రాలు ఉన్నాయా? ఎలక్ట్రానిక్ వస్తువులేమైనా ఉన్నాయా? అనేది క్షుణ్ణంగా తనిఖీ చేసి పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. తమ విచారణలో టెన్త్ హిందీ ప్రశ్నపత్రం ఉప్పల్ నుంచి లీకైనట్లు ఎలాంటి ఆధారాలూ దొరకలేదని తెలిపారు. అయినప్పటికీ దీనిపై విచారణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

మిత్రుడి కోసం మైనర్ దుస్సాహసం

కమలాపూర్ మండలం ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న తన మిత్రుడికి చిట్టీలు అందించేందుకు ఓ మైనర్ ప్రశ్నపత్రం ఫొటో తీసుకున్నట్లు పోలీస్‌వర్గాలు చెప్పాయి. పదో తరగతి పరీక్షల్లో అన్నింటికీ ఒకే సెంటర్‌లో ఒకే గదిలో పడుతుంది. దీనిని గమనించిన మైనర్.. కమలాపూర్ ప్రభుత్వ బాలుర పాఠశాల సెంటర్‌లో పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థితో ముందుగా మాట్లాడుకున్నట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే.. మైనర్.. స్కూల్ ప్రహరీ పక్కనే ఉన్న చెట్టు సహాయంతో గోడ ఎక్కి పాఠశాలలోని మొదటి అంతస్తు మూడవ సంబర్ గది గోడ పక్కనే ఉన్న కిటికీ వద్ద పరీక్ష రాస్తున్న బాలుడి నుంచి ప్రశ్నపత్రం తీసుకుని ఫొటోలు తీసుకుని వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేసినట్లు గుర్తించారు. స్నేహితుడి కోసం చేసిన పని ఆ బాలుడిని జైలుకు పంపించగా.. రాష్ట్రంలో కలకలం సృష్టించింది. కాగా, మైనర్ ఇంత సాహసం చేస్తాడా.. ఒక్కని వల్లే ఇదంత సాధ్యమా అన్న వాదన కూడా వినిపిస్తోంది. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు పోలీసులు ప్రకటించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఒక్కరినైనా బందోబస్తు కోసం ఉంచాలి. కానీ ఎక్కడా ఉంచడం లేదని తెలుస్తోంది.

హిందీ పరీక్షకు హాజరు ఇలా..

జిల్లా	కేంద్రాలు	మొత్తం విద్యార్థులు	హాజరు	గైర్హాజరు
వరంగల్	56	9,710	9,694	16
హనుమకొండ	68	11,715	11,700	15
జనగామ	42	6,736	6,729	07
మహబూబాబాద్	50	8,450	8,433	17
జేఎస్ భూపాలపల్లి	20	3,651	3,645	06
ములుగు	21	3,170	3,163	07

వికారాబాద్ ఘటనతో సెల్‌ఫోన్లకు నో పర్మిషన్

మొదటి రోజు వికారాబాద్ ఘటనతో టెన్త్ పరీక్షల కేంద్రంలోకి ఏ ఒక్కరు కూడా సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లకూడదని విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. డీఈఓలు.. ప్రతి పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లకు ఫోన్‌చేసి సెల్‌ఫోన్‌లు ఎవరూ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్లు, పరీక్ష సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకెళ్లలేదని, అయినా ఎలా లీకైందని లోతుగా దర్యాప్తు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన



హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట రోడ్డుపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు

విద్యారణ్యపురి: పదవ తరగతి హిందీ పేపర్ లీక్ వ్యవహారంపై యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం హనుమకొండలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం కలకలం రేపుతున్న వేళ పదవ తరగతి పరీక్ష పేపర్లు కూడా లీక్ అయ్యాయన్నారు. ప్రశ్నపత్రాలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో పిల్లలు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నార న్నారు. అనంతరం డీఈఓ అబ్దుల్‌హైకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పల్లె రాహుల్‌రెడ్డి, అలువాల కార్తీక్, పల్లకొండ సతీష్, తోట పవన్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదుట బీజేపీ నేతల ధర్నా

- జర్నలిస్టు బూర ప్రశాంత్‌ను విడుదల చేయాలని డిమాండ్
- రావు పద్మతోపాటు పలువురి అరెస్ట్



పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట మంగళవారం రాత్రి హైడ్రామా నెలకొంది. పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ విషయంలో అరెస్టు చేసిన జర్నలిస్టు బూర ప్రశాంత్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ధర్నాకు దిగారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, రావుల కిషన్‌తోపాటు ఇతర నాయకులు హెడ్ క్వార్టర్ వద్దకు చేరుకున్నారు. బూర ప్రశాంత్‌ను అరెస్టు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. హనుమకొండ ఏసీపీ కిరణ్ కుమార్, సుబేదారి, హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌లు చేరుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. రావు పద్మతోపాటు నాయకులు తాము సీపీ రంగనాథ్‌ను కలిసి డిమాండ్లు వివరించి వెళ్లిపోతామని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు ఎంత సముదాయించినా వినకపోవడంతో అదుపులోకి తీసుకుని హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బూర ప్రశాంత్‌పై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకుని వెంటనే విడుదల చేయాలని రావు పద్మ డిమాండ్ చేశారు.

బెయిల్ కోసం ముమ్మర ప్రయత్నాలు

దేశాయిపేట: భూ ఆక్రమణలకు పాల్పడిన కేసులో నిందితులుగా పరకాల జైలుకు వెళ్లిన 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య, తూర్పాటి శ్రీనివాస్‌లు బెయిల్ కోసం, పరారీలో ఉన్న మాజీ కారోబార్ రఘు, హరిప్రసాద్‌లు ముందస్తు బెయిల్ కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. నగర శివారులోని ఏనుమాముల తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ భర్త సారయ్య, కుమారుడు హరిప్రసాద్, రఘు, శ్రీనివాస్, భూ ఆక్రమణలకు పాల్పడినట్లు తేలడంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ సమయంలో రఘు, హరిప్రసాద్‌లు పరారు కావడంతో మిగిలిన ఇద్దరు సారయ్య, శ్రీనివాస్‌లను 30న పోలీసులు అరెస్టు చేసి పరకాల జైలుకు తరలించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం రఘు, హరిప్రసాద్‌లు తీవ్రంగా ప్రయత్నించినప్పటికి రాలేదని తెలిసింది. కాగా సారయ్య, శ్రీనివాస్‌లకు నేడో రేపో బెయిల్ వస్తుందని సమాచారం. పరారీలో ఉన్న వారు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లుగా తెలుస్తోంది.

ఆస్తుల అటాచ్‌మెంట్...?
కబ్జాలకు పాల్పడి ఆక్రమించుకున్న నిందితుల పేర ఉన్న ఆస్తులను అటాచ్‌మెంటు చేసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. నిందితులైన రఘు, హరిప్రసాద్‌ల పేర సుమారు వంద వరకు డాక్యుమెంట్లు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ మేరకు అసలు హక్కుదారులను గుర్తించే పనుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- 8,9 తేదీల్లో ఎస్సై రాత పరీక్ష
- పరీక్ష కేంద్రాలు 21.. అభ్యర్థులు 14,380
- సీపీ ఏవీ రంగనాథ్




సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: సబ్ ఇన్‌స్పెక్టర్ల రాత పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. స్టయిఫండరీ ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సివిల్, ఐటీ, కమ్యూనికేషన్స్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్, ఫింగర్ ప్రింట్ పోస్టులకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమిషరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు 14,380 మంది అర్హత సాధించారని, ఇందులో 3,315 మంది మహిళలు ఉన్నట్లు చెప్పారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని, హాల్ టికెట్‌తోపాటు బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్ను తీసుకురావాలని సూచించారు. ఖరీదైన వస్తువులు, సెల్‌ఫోన్లు కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. ఇన్విజిలేటర్లకు బయోమెట్రిక్ నమోదు చేసే విధానంపై తగు శిక్షణ ఇవ్వాలని సీపీ సూచించారు. ఇన్విజిలేటర్లకు సెల్‌ఫోన్లు అనుమతించరాదని, పరీక్ష కేంద్రాలకు అనుమతి లేనిదే మీడియా ప్రతినిధులకు అనుమతించవద్దని పేర్కొన్నారు. సమావేశంలో క్రైమ్స్ డీసీపీ మురళీధర్, ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, రిజినల్ కోఆర్డినేటర్ ఆనంద్ కిషోర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ కిరణ్‌కుమార్, ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర్, పరీక్షకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతోత్సవంలో మహిళలదే కీలకపాత్ర

మేయర్ గుండు సుధారాణి




మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: స్వచ్ఛతోత్సవ్- 2023లో మహిళల పాత్ర కీలకమని, సాధికారత నిరూపించుకోవడానికి చురుగ్గా పాల్గొనాలని నగర మేయర్ గుండు సుధారాణి కోరారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో జ్యోతి, ఓరుగల్లు, శ్రీ శక్తి పట్టణ సమాఖ్య సభ్యులతో సమావేశం జరిగింది. స్వచ్ఛతోత్సవంలో ఎస్‌హెచ్‌జీల భాగస్వామ్యం, నిర్దేశించిన పట్టణ సమాఖ్యల్లోని స్లమ్ ఏరియాల వారీగా పనితీరుపై మేయర్ సమీక్షించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. వ్యర్థాలనుంచి సంపద సృష్టించుకోవడంపై స్వయం సహాయక సంఘాల మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. విమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు పొందేందుకు మహిళ సంఘాలు ఆయా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేసిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. స్థానిక కార్పొరేటర్‌లతో సమన్వయం చేసుకుంటూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ విజయలక్ష్మి ,టీఎంసీ రమేష్, జన శిక్షణ సంస్థ ప్రతినిధి తిరుపతి, ఆర్పీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్ భాస్కర్

కాజీపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలోని ప్రధాన రహదారిపై రూ.2.25 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో సాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో చిన్నాచితక పార్టీలు చేతులు కలిపి అర్థం లేని విమర్శలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఎంత మంది ఒక్కటైనా రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన కాజీపేటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు సంకు నర్సింగ్, జోరిక రమేష్, సుంచు కృష్ణ, కాటపురం రాజు, ఎండి సోని పాల్గొన్నారు.

పండుగలా ఆత్మీయ సమ్మేళనాలు
హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను పండుగలా నిర్వహించుకుందామని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, మర్రి యాదవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేసి నిజాయితీ చాటుకోవాలి

కాజీపేట: వరంగల్ జిల్లా ప్రజల చిరకాలవాంఛగా మిగిలిపోతున్న రైల్వేకోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ చేపట్టిన పోరుయాత్ర మంగళవారం కాజీపేట పట్టణానికి చేరుకున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వేపరంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. మతతత్వంతోపాటు పూర్తి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఆ పార్టీని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, పంజాల రమేష్, కర్రె భిక్షపతి, మద్దెల ఏల్లేష్, మాలోతు శంకర్, భిక్షపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటెలిజెన్స్ కార్యాలయంలో మద్యం తాగిన కానిస్టేబుల్


ఆఫీసులో రంగయ్య, పక్కన టేబుల్‌పై మద్యం బాటిల్

భూపాలపల్లి: పోలీస్ ఇంటెలిజెన్స్ కార్యాలయంలో ఓ కానిస్టేబుల్ మద్యం సేవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇంటెలిజెన్స్ విభాగం కానిస్టేబుల్ రంగయ్య సోమవారం ఏకంగా కార్యాలయంలోనే మద్యం సేవించాడు. ఈ వీడియోను తీసిన వ్యక్తి మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఆ వీడియోలో రంగయ్య ఆఫీసులో కూర్చొని ఉండగా పక్కనే టేబుల్‌పై మద్యం బాటిల్ మాత్రం ఉంది.

ఆత్మహత్యాయత్నం

ఖిలా వరంగల్: అప్పులు చెల్లించాలని ఇల్లును విక్రయించేందుకు సిద్ధపడిన ఓ వ్యక్తి స్థానికుల బెదిరింపులతో రంగసముద్రం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. పెట్రోలింగ్ పోలీసులు అతన్ని కాపాడి ఒడ్డుకు తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈఘటన మంగళవారం ఉదయం వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లోని రంగసముద్రం చెరువు వద్ద జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కరీమాబాద్ డీ.కె.నగర్‌కాలనీ చెందిన చిలువేరు శంకర్, వెంకటేశ్, చందర్ ముగ్గురు అన్నదమ్ములు. వీరి తల్లిదండ్రులు ఇద్దరు అనారోగ్యంతో గత ఏడాది మృతి చెందారు. తల్లిదండ్రుల వైద్య పరీక్షల కోసం తెలిసిన చోట అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గం లేక ఇల్లు విక్రయించేందుకు సిద్ధపడ్డారు. ఓ బీఆర్ఎస్ కార్యకర్త తక్కువ ధరకు ఇల్లును తనకే విక్రయించాలని, లేదంటే ఇల్లు ఎలా విక్రయిస్తావు అంటూ వారిని బెదిరించినట్లు సమాచారం. దీనితో మనస్థాపం చెందిన చిలువేరు వెంకటేశం మంగళవారం ఉదయం ఉర్సు రంగసముద్రం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి అతన్ని కాపాడినట్లు తెలిసింది. బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. పోలీసులు ఎవరూ అందుబాటులోకి రాలేదు.

బస్తాల బరువు టెన్షన్

- చాంబర్ వర్సెస్ మార్కెట్ కమిటీ
- గంటన్నరపాటు నిలిచిన మిర్చి కొనుగోళ్లు


కొనుగోళ్లు నిలిచిపోవడంతో నిరీక్షిస్తున్న రైతులు


మినీ చాంబర్ ఆఫీసులో చర్చిస్తున్న చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతుల పరిస్థితి 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది' అన్న చందంగా తయారైంది. మిర్చి కొనుగోలు చేసిన ఖాళీ బస్తాలకు డబ్బులు చెల్లించాలని రైతులు చేసిన డిమాండ్‌తో కొత్త నిబంధనలు తెరపైకి వచ్చాయి. పక్కనే ఉన్న ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ఖాళీ బస్తాకు రూ.25లు చెల్లిస్తున్నారని, అదే విధంగా వరంగల్ మార్కెట్‌లో చెల్లించాలని రైతు సంఘాలు డిమాండ్ చేయడంతో పాటు వరంగల్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఖాళీ బస్తాలకు ధరల చెల్లింపుల విధానాన్ని పరిశీలించేందుకు ఖమ్మం మార్కెట్‌కు వెళ్లిన మార్కెట్ కమిటీ, చాంబర్ ప్రతినిధులు అక్కడ అమలవుతున్న 25కిలోల కంటే తక్కువ, 50కిలోల బరువు కంటే ఎక్కువ ఉండకుండా వస్తున్న మిర్చి బస్తాలను పరిశీలించి వచ్చారు. బస్తాలకు డబ్బుల చెల్లింపు, బస్తాల బరువు వివాదంపై రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో మార్చి 12న హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌజ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బస్తాలకు డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న అధికారులు ఖమ్మంలో అమలవుతున్న బస్తాల బరువు విధానం ఇక్కడ అమలు చేయాలని చాంబర్ ప్రతినిధులు కమిటీపై ఒత్తిడి తీసుకొచ్చారు. వ్యవసాయ మార్కెట్‌లో క్రయ, విక్రయాలు పూర్తిగా వ్యాపారుల కనుసన్నుల్లోనే జరుగుతున్న ఈవిధానంపై కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఏప్రిల్ 1 నుంచి వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో అమలు చేస్తామని హామీ ఇవ్వడంతోపాటు సుమారు లక్ష కరపత్రాలు, వందల ఫ్లెక్సీలను తయారు చేయించింది. తయారు చేసిన కరపత్రాలు ఎక్కడ పంపిణీ చేశారో...ఫ్లెక్సీలో ఎక్కడ కట్టారో తెలియదో కాని సోమవారం యధా విధంగా రైతులు మిర్చి బస్తాలను గతంలో తెచ్చిన విధంగానే మార్కెట్‌కు తీసుకొచ్చారు. నాలుగు రోజుల తర్వాత మార్కెట్ ప్రారంభమైనందున తొలిరోజు కొనుగోళ్లు నిలిపివేస్తే గొడవ అవుతుందని భావించిన కొనుగోలుదారులు మిన్నకుండిపోయారు. మంగళవారం అదే విధంగా బస్తాలను తీసుకురావడంతో ఛాంబర్ ప్రతినిధులు ఉదయం 7.30గంటలకు జరిగే వేలం పాటలను నిలిపివేసి మార్కెట్ ఆవరణలోని మినీ చాంబర్‌లో సమావేశమయ్యారు. దీంతో సుమారు గంటన్నర పాటు మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. చివరకు నూతన విధానం అమలుకు సమయం పడుతుందని భావించిన అడ్తిదారులు, కొనుగోలుదారులు మిర్చిని కొనుగోలు చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

కమిటీ వర్సెస్ చాంబర్..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అమలవుతున్న విధంగా ఖాళీ మిర్చి బస్తాలకు డబ్బులు ఖచ్చితంగా చెల్లించాలని మార్కెట్ కమిటీ పట్టుపట్టడంతో అక్కడ అమలవుతున్న విధానం అమలు చేయాలని ఛాంబర్ వ్యాపారులు భీష్మించుకోవడం రైతులకు దిక్కుతోచకుండా పోయింది. గతంలో బస్తాలకు డబ్బులు చెల్లింపులు కొంత అస్తవ్యస్తంగా జరిగినా తక్కువ, ఎక్కువ కిలోల బస్తాల సమస్యల లేకపోవడంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడలేదు. మార్కెట్ కమిటీ రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమైందని చాంబర్ ప్రతినిధులు అంటుండగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అడ్తిదారులపై ఉందని మార్కెట్ కమిటీ అనడంతో వివాదం నెలకొంది. అయితే నూతన విధానంపై ప్రస్తుతం అవగాహన కల్పిస్తే వచ్చే సీజన్‌లో అమలయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు, అధికారులు అభిప్రాయపడుతున్నారు. నేడు మార్కెట్‌కు సెలవు ఉన్నందున రేపు మార్కెట్‌లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.

శతచండీ మహాయాగంలో కుంకుమపూజ


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్ దంపతులు

కాజీపేట అర్బన్ : శతచండీ మహామాగంలో భాగంగా మంగళవారం రెండో రోజు మహిళలు అత్యధికంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ నిర్వహించారు. మాంగళ్య షాపింగ్‌మాల్, పీఎస్ మూర్తి అండ్ ఫ్యామిలీ, కాసం పుల్లయ్య అండ్ సన్స్ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డులోని ఖమ్మం బైపాస్ పక్కన వారి సొంత స్థలంలో ఈ మహామాగం నిర్వహిస్తున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి కటాక్షం రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలకు కలగాలని, రాజకీయాలకు, వ్యాపారాలకతీతంగా శతచండీ మహాయాగంలో నగర ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మెల్యే 'అరూరి'కి జన్మదిన శుభాకాంక్షలు


ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న పార్టీ నాయకులు

హసన్‌పర్తి: వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, పావుశెట్టి శ్రీధర్, మణీంధర్‌నాథ్, ఆటికం రవీందర్, జంగా కుమార్, ఎరుకొండ శ్రీనివాస్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రజిత, సిరంగి సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జక్కు రమేష్, రైతు బంధ సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్ బాబు, సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్ రావు ఎమ్మెల్యేను కలిసి బొకే అందించారు.

మహిళ అనుమానాస్పద మృతి

నర్మెట: మండలంలోని హన్మంతాపూర్‌లో ఆదివారం రాత్రి మహిళ మృతిచెందింది. ఎస్సై షేక్ జానీపాషా మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంతాపూర్‌కు చెందిన రాయారపు రామలక్ష్మి (57)కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు ముగ్గురు సంతానం. భర్త లేడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం వరకు తల్లి ఇంటినుంచి బయటికి రాకపోవడంతో చిన్నకుమారుడు ఇంట్లోకి వెళ్లి చూడగా తల్లి మృతిచెంది ఉండటం, మెడలోని బంగారు గొలుసు కనిపించకపోవడంతో సోదరి జ్యోతికి సమాచారమిచ్చాడు. కుమార్తె జ్యోతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని వీరాపురంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరాపురం గ్రామానికి చెందిన కొండగొర్ల ప్రశాంత్ (22) మంగళవారం ఉదయం భోజనం అనంతరం ఇంటి ఎదుట దండంపై టవల్ పట్టుకోవడంతో విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తల్లి మందలించిందని విద్యార్థి బలన్మరణం


చెరుప వేణు (ఫైల్)

గూడూరు: కాలేజీకి వెళ్లమని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ డిగ్రీ విద్యార్థి పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనకు సంబంధించి, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిర్రకుంటతండా శివారు కోయగూడేనికి చెందిన చెరుప వేణు (19) గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. వేణు కాలేజీకి వెళ్లకుండా బయట తిరుగుతున్నాడని తల్లి యాకమ్మ తరచూ మందలించేది. ఏప్రిల్ 1న కాలేజీకి వెళ్లమని తల్లి మందలించి, పనికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన వేణు ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. తర్వాత ఇంటికి వచ్చిన తల్లికి పురుగుల మందు తాగానని చెప్పడంతో వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని, అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ వేణు మంగళవారం రాత్రి మృతిచెందినట్లు తల్లి యాకమ్మ తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

కౌలు రైతు..


సత్తయ్య(ఫైల్)

కాటారం: పంట సాగు కోసం చేసిన అప్పు ఓ కౌలు రైతు పాలిట శాపంగా మారింది. భూమి కౌలుకు తీసుకొని ఆరుగాలం శ్రమించి పంట సాగు చేస్తే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తనువు చాలించాడు ఓ కౌలు రైతు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం నస్తూర్‌పల్లికి చెందిన మేర్జాల సత్తయ్య(48) తనకు ఉన్న ఎకరంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. పెట్టుబడి కోసం తెలిసిన వారి వద్ద రూ.3లక్షల మేర అప్పు చేశాడు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని తీవ్ర మనస్తాపానికి గురైన సత్తయ్య సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సత్తయ్య కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మనోవేదనతో గొర్రెల కాపరి..


ఎల్లయ్య(ఫైల్)

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి, పెంపకందారుడు రాజబోయిన ఎల్లయ్య(42) ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగళ్ల వానకు తన జీవాల మృతిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. గీసుకొండ పోలీసులు, బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మారంలో ఇటీవల భారీ వర్షాలు, పిడుగుపాటు చోటు చేసుకోవడంతో ఎల్లయ్యకు చెందిన ఆరు గొర్రెలు మృతి చెందాయి.. పలు జీవాల అస్వస్థతకు గురయ్యాయి. అలాగే పిల్లలు మృత్యువాత పడటంతో ఆర్థికంగా కుంగిపోయిన ఎల్లయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 3వ తేదీన తన గొర్రెలను మందలో కలిపి పురుగుల మందు తాగడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

భార్య కాపురానికి రావడంలేదని..

ఖిలా వరంగల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన మంగళవారం ఉదయం ఉర్సు కరీమాబాద్‌లోని అప్పాలవారి వీధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం కట్య్రాలకు చెందిన సదిరం రోజాకు కరీమాబాద్‌కు చెందిన సదిరం రాజ్‌కుమార్(30)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈదంపతులకు పిల్లలు లేరు. రెండేళ్లుగా రాజ్‌కుమార్ మేస్త్రీ పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్య భర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల భార్య రోజా పుట్టింటికి వెళ్లింది. కట్య్రాలలో ఉంటున్న రోజా వద్దకు రాజ్‌కుమార్ సోమవారం వెళ్లాడు. ఇంటికి రావాలంటూ భార్యను కోరాడు. హైదరాబాద్‌లో ఇరువురం పనిచేసి బతుకుదామంటే వస్తానని భార్య రాజ్‌కుమార్‌కు తెల్చి చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ మంగళవారం ఉదయం కరీమాబాద్‌లోని అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ తల్లి అతడి భార్యకు, మిల్స్‌కాలనీ కాలనీ పోలీసుల సమాచారం అందజేయగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. రాజ్‌కుమార్ భార్య రోజు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యచేసి.. యాక్సిడెంట్‌గా చిత్రీకరించి ?

వరంగల్ (పర్వతగిరి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో వ్యక్తిని హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ శివారు ముంజాలకుంటతండా సమీపంలో మార్చి 31న జరిగిన ప్రమాదంలో జాటోతు శ్రీను మృతి చెందాడు. ఇది పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్న కారణం కానీ.. శ్రీనును హత్య చేసి ట్రాక్టర్‌కు ఎదురుగా వచ్చి ప్రమాదంలో మృతి చెందాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అనుమానం కలిగిన పోలీసులు తండావాసుల నుంచి పూర్తి సమాచారం సేకరించినట్లు తెలిసింది. శ్రీనుకు మద్యం తాగించి హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. హత్యకు సంబంధించిన వివరాలను పోలీసులు నేడు లేదా రేపు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

బైక్ నుంచి రూ.2లక్షలు చోరీ


షాపులో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఏసీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ షాపు ఎదుట ద్విచక్రవాహనాన్ని ఉంచి షాపులోకి వెళ్లి వచ్చేసరికి బైక్ కవర్‌లో ఉన్న రూ.2లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన డివిజన్ కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. జనగామ జిల్లా చిల్పూరు మండలం పల్లగుట్టకు చెందిన గొడుగు యాదగిరి తన అవసర నిమిత్తం ఘన్‌పూర్ ఎస్‌బీఐలో మంగళవారం ఖాతా నుంచి రూ.2లక్షలు డ్రా చేశాడు. డబ్బులను తన బైక్ కవర్‌లో ఉంచాడు. అక్కడ నుంచి పల్లగుట్ట శివారులోని సయ్యద్‌హుస్సేన్‌పల్లిలోని తన ఇంటికి బయల్దేరాడు. అయితే స్థానిక బస్టాండ్‌కు సమీపాన ఉన్న ఓ దుకాణంలో స్క్రూలు కొనుక్కొని వచ్చేసరికి బైక్ కవర్‌లో ఉన్న రూ.2లక్షలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయాన్ని గుర్తించి లబోదిబోమని రోదించాడు. కాగా, బాధితుడు ఈ విషయమై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సమాచారం తెలిసిన వెంటనే ఏసీపీ రఘుచందర్, సీఐ రాఘవేందర్ బాధితుడు స్క్రూలు కొన్న షాపు వద్దకు చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సీసీ ఫుటేజీలలో బైక్ కవర్ నుంచి ఓ యువకుడు డబ్బులు తీస్తున్న దృశ్యం అస్పష్టంగా కనిపిస్తుంది. కాగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, బాధితుడికి న్యాయం చేస్తామని సీఐ తెలిపారు.

దొంగతనాల కేసుల్లో ఇద్దరి అరెస్టు

- రూ.23.20 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సీతారాం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: రాత్రి వేళల్లో ఇళ్లలో ఎవరూ లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడుకు చెందిన తండ్రీకొడుకులు దాసరి నర్సయ్య, దాసరి మురళి అలియాస్ బాలు అలియాస్ కృష్ణలను యశ్వంతాపూర్ వద్ద అరెస్టు చేసినట్లు డీసీపీ సీతారాం తెలిపారు. వీరివద్ద నుంచి 34 గ్రాముల బంగారు ఆభరణాలు, 71 తులాల వెండి ఆభరణలు, బైక్, ఆటో మొత్తం రూ.23,20,000 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితులు ఇద్దరు ప్రస్తుతం హైదరాబాద్ వనస్థలిపురంలో ఉంటూ కూలీ పనులు చేసుకొని, జీవనం సాగిస్తుండగా కూలీ డబ్బులు సరిపోకపోవడంతో జనగామ, బచ్చన్నపేట పోలీసుస్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని వివరించారు. హైదరాబాద్‌లో రాజులకొత్తపల్లికి చెందిన అంగడి సురేశ్, అంగడి జంపయ్యతో కలిసి 15 వరకు దొంగతనాలకు పాల్పడ్డారని, సురేష్‌ను నల్గొండ పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టగా దాసరి మురళిని నెల్లికుదురు పోలీసులు అరెస్టు చేసి పీడీ యాక్ట్‌లో చర్లపల్లి జైలుకు పంపారు. 2018లో జైలు నుంచి వచ్చి తొర్రూరు, భువనగిరి, మహబూబ్‌నగర్ మిడ్జిల్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడి పీడీ యాక్ట్‌లో జైలుకు వెళ్లి తిరిగి మళ్లీ వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతుండగా యశ్వంతాపూర్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఆటోలో వెళ్తున్న మురళి, నర్సయ్యలను అరెస్టు చేసినట్లు డీసీపీ వివరించారు. నిందితులను పట్టుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసు, నాగబాబు, ఎస్సై రఘుపతి, ఏఎస్సై శ్రీనివాసరాజు, పోలీసు కానిస్టేబుళ్లను డీసీపీ అభినందించారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

- కర్రలు, మట్టి పెల్లలతో దాడి


భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ రెవెన్యూ పరిధిలో మంగళవారం భూమి విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కర్రలు, మట్టిపెల్లలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. సోలిపూర్ గ్రామానికి చెందిన కొందరు గొల్లకురుమలు 50ఏళ్ల క్రితం గ్రామ రెవెన్యూ పరిధిలో గ్రామానికి చెందిన ముద్దసాని జైపాల్‌రెడ్డి వద్ద 18 ఎకరాలు కొనుగోలు చేశారు. అందులో గొర్రెలు, మేకలు మేపుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా ముద్దసాని జైపాల్‌రెడ్డి కుమారుడు స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధి భర్త ముద్దసాని వెంకట్‌రెడ్డి వద్ద సర్వే నంబర్ 56లో 3.04 గుంటల భూమిని మండలకేంద్రానికి చెందిన తాళ్లపల్లి పోషయ్య గతంలో కొనుగోలు చేశాడు. ఆ భూమి మీదికి పోషయ్యను గొల్లకురుమలు రానీయడం లేదు. భూమి తమదంటే.. తమదంటూ ఇరువర్గాల మధ్య కొన్నిరోజులుగా భూవివాదం కొనసాగుతోంది. దీంతో పోషయ్య భూమి అమ్మిన ముద్దసాని వెంకట్‌రెడ్డికి విషయం తెలిపాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ముద్దసాని వెంకట్‌రెడ్డి, మరో మండల ప్రజాప్రతినిధి అర్జుల మధుసూదన్‌రెడ్డిలు భూమి వద్ద రక్షణగా ఉండగా, తాళ్లపల్లి పోషయ్య హద్దులు రాళ్లు ఏర్పాటు చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న గొల్ల కురుమలు అక్కడికి చేరుకొని హద్దురాళ్లు ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. కర్రలతో కొట్టుకోవడం, మట్టిపెల్లలు విసురుకోగా సోలిపూర్ గ్రామానికి చెందిన ఎర్ర బీరయ్య తీవ్రంగా గాయపడగా, సాయిల్ల కనకమ్మ, చెవిటి లచ్చమ్మ, చెవిటి యాదయ్య స్వల్పంగా గాయపడ్డారు. స్థానిక ఎస్సై నరేష్ సిబ్బందితో అక్కడకు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొల్లకురుమలు మొదట దాడి చేశారు

గతంలోనే సాదాబైనామా ద్వారా భూమిని కొనుగోలు చేశా. హద్దురాళ్ల ఏర్పాటు చేస్తుండగా గొల్లకురుమలు కర్రలతో దాడి చేశారు. హద్దురాళ్ల ధ్వంసం చేశారు. మేం ప్రతిఘటించాం.

\- తాళ్లపల్లి పోషయ్య, భూమి కొన్న వ్యక్తి

విచక్షణారహితంగా దాడి చేశారు



జీవాల మేత కోసం ముద్దసాని వెంకట్‌రెడ్డి వద్ద భూమిని కొనుగోలు చేశాం. సర్వే రిపోర్టు తప్పుగా చేయించుకొని మాకు చెందాల్సిన భూమిని అధికార బలంతో లాక్కోవాలని చూస్తున్నారు. హద్దులు నాటుతున్నారని తెలిసి మేమంతా వెళ్లాం. పనులు ఆపమని అన్నాం. వృద్ధులు, మహిళలు అని కూడా చూడకుండా దాడి చేశారు.

\- ఎర్ర బీరయ్య